క్లుప్తంగా

బాధిత కుటుంబానికి సాయం

సారంగపూర్: మండలంలోని సోనాపూర్ గ్రామానికి చెందిన తాజా మాజీ ఉపసర్పంచ్ జాదవ్ సంతోష్ సోదరుడు గణేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. స్థానిక ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి కారణాలను తెలుసుకొన్నారు. అనంతరం రూ.ఐదు వేలను బాధిత కుటుంబానికి సాయంగా అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నర్సయ్య ఉన్నారు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం

నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ ఇటీవల పదోన్నతి పొందగా శనివారం ఆయనను పలువురు అధ్యాపకులు ఘనంగా పూలమాల వేసి శాలువాతో సన్మానించారు. మరిన్ని పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు. ఇందులో అధ్యాపకులు మధు, అసోసియేట్ ప్రొఫెసర్ మురళి, నరసయ్య, రాజశేఖర్, జి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం కోసం వినతి

ఖానాపూర్: పట్టణంలోని భీం చౌరస్తాలోని డబుల్ బెడ్‌రూం నివాసాల్లో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని కోరుతూ యంగ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో తహసీల్దార్ సుజాతకు శనివారం తన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కాలనీలోని 400 కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని దుకాణం ఏర్పాటు చేయాలని కోరారు. యూత్ అధ్యక్షుడు షకీల్, ఉపాధ్యక్షుడు అల్జాజ్, తదితరులున్నారు.

క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

లోకేశ్వరం: జనగణనతోపాటు కులగణన చేయాలని నిర్ణయించిందుకు శనివారం మండలకేంద్రంలోని భగత్‌సింగ్ చౌరస్తాలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. బీజేపీ మండల కన్వీనర్ సాయన్న, అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్‌కుమార్, నల్ల రమేశ్, చిన్నారావు, శ్రీధర్, జయసాగర్, విలాస్, సంటేన్న, సంతోష్, రాజశేఖర్, కోటేశ్‌బాబు ఉన్నారు.

'పది' విద్యార్థులకు సన్మానం

ముధోల్: మండలకేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో ఇటీవల పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులను సాధించిన విద్యార్థులను శనివారం ఘనంగా సన్మానించారు. పాఠశాల కమిటీ అధ్యక్షులు రవీందర్‌పాండే, సరస్వతీ విద్యాపీఠం జిల్లా కోశాధికారి సుదర్శన్, పాఠశాల అధ్యక్షుడు సంజీవ్, ఉపాధ్యక్షుడు రోళ్ల రమేష్, కార్యదర్శి నిశికాంత్, సహ కార్యదర్శి దర్బార్ నవీన్, సభ్యులు దత్తాత్రి, వెంకటేశ్, ప్రధానాచార్యులు సారథిరాజు, పోషకులు పాల్గొన్నారు.

బీరప్ప ఉత్సవాలు ప్రారంభం



ఊరేగింపులో జాన్సన్‌నాయక్, భక్తులు

ఖానాపూర్: మండలంలోని బావాపూర్(కె) గ్రామంలో బీరప్ప దేవుడి ఆలయ ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. బీరప్ప –కామరాతి కల్యాణోత్సవంలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గంగబోనంతో ఊరేగింపు నిర్వహించారు. కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

'అరాచకాలను అరికట్టాలి'

ఖానాపూర్: మహిళలు అణచివేత, అరాచకాలు, అసమానత, వివక్ష ఎదుర్కొంటున్నారని.. వాటిని అరికట్టాలని పీవోడబ్ల్యూ(విముక్తి) జిల్లా కన్వీనర్ చుక్కల కళ అన్నారు. శనివారం పట్టణంలోని విద్యానగర్‌లో పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో మే డే నిర్వహించారు. దేశంలో ఆపరేషన్ కాగార్‌ను నిలిపివేయాలని కోరారు. ఎర్రోళ్ల శిరీష, అమ్ముల కవిత, శ్రీనివాస్, దేవేందర్ ఉన్నారు.

'కోతల్లేకుండా చూడాలి'



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

బాసర: మండలకేంద్రంలోని కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలకు విరుద్ధంగా ధాన్యంలో కోతలు విధించకుండా చూడాలని శనివారం భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు తహసీల్దార్ పవన్‌చంద్రకు ఫిర్యాదు చేశారు. బస్తాకు రెండు కిలోలు ఎక్కువ తూకం వేస్తూ.. రైతులను మోసం చేస్తున్నారని.. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కిసాన్ సంఘ్ సభ్యులు, రైతులు ఉన్నారు.



ఉష్ణ తాపానికి విలవిల..!

జిల్లావ్యాప్తంగా రోజూ 44 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రజలతోపాటు మూగజీవాలు భానుడి ప్రతాపానికి అల్లాడుతున్నాయి. ఎండలు ముదిరిపోవడంతో కుంటాల మండలంలోని ఓలాలో ఓ వ్యాపారి రోజుకు ఆరుసార్లు ఇలా కోళ్లకు నీళ్లు పట్టిస్తూ కాపాడుతున్నాడు. – కుంటాల



ప్రమాదం జరిగితేనే మరమ్మతులు చేస్తారా?

భైంసారూరల్: మండలంలోని కామోల్ గ్రామంలో బస్టాండ్ పక్కనున్న డ్రైయినే జీ పైకప్పు కూలుతోంది. స్లాబ్‌పై నుంచి ట్రాక్టర్లు వెళ్లడంతో ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో వచ్చిపోయేవారు కింద పడుతున్నారు. అధికారులు మరమ్మతులు చేపట్టాలని జనం కోరుతున్నారు.

వామ్మో జెర్రిపోతు..

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలో శనివారం ఎనిమిది అడుగుల జెర్రిపోతు కలకలం సృష్టించింది. ఇంద్రానగర్‌కాలనీలో ధర్మాజీగారి కృష్ణ తన నివాసంలో జెర్రిపోతు సంచరిస్తుండటాన్ని చూసిన యజమాని..శాంతినగర్ కాలనీకి చెందిన స్నేక్ క్యాచర్ గిరిగంటి వనీల్‌కు సమాచారం అందించాడు. వనీల్ వచ్చి పామును పట్టుకునేందుకు యత్నించగా ఆయన కాలును చుట్టేసింది. అనంతరం చాకచాక్యంగా పట్టుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎండ వేడిమికి తాళలేక జనావాసాల్లోకి వస్తాయని.. జనం అప్రమత్తంగా ఉండాలని స్నేక్ క్యాచర్ పేర్కొన్నాడు.



కూల్ కూల్.. వ్యాపారం

ప్రస్తుత ఎండాకాలంలో భానుడు ఉగ్రరూపం దాలుస్తుండటంతో ప్రతి ఇంట్లో కూలర్లను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకుంటున్నారు. సుమారు 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో జనం అల్లాడుతున్నారు. దీంతో ప్రజలు ఉక్కపోత నుంచి రక్షణ పొంది చల్లదనం కోసం కూలర్లను కొంటున్నారు. మరోవైపు పెళ్లిళ్ల సీజన్ కావడంతో కట్నకానుకలు, బహుమతుల జాబితాలో కూలర్లు చేరడంతో వీటికి మరింత డిమాండ్ పెరిగినట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా జిల్లాకేంద్రంతోపాటు మండలకేంద్రాలు, పట్టణాల్లో కూలర్ల దుకాణాలు జోరుగా వెలుస్తున్నాయి. ఏటా వేసవి కాలంలో కూలర్ల వ్యాపారం రూ.కోట్లలో జరుగుతుందని దుకాణాల యజమానులు పేర్కొంటున్నారు. తానూరు/ముధోల్



తానూరులో అమ్మడానికి సిద్ధంగా ఉన్న కూలర్లు

సండే స్పెషల్

- ఎండలు పెరగడంతో కూలర్ల దుకాణాలకు గిరాకీ
- గ్రామాల్లోనూ పెరిగిన వినియోగం
- హాట్ కేకుల్లా అమ్మకం
- ఏటా రూ.కోట్లలో వ్యాపారం

అందుబాటు ధరల్లో..

మార్కెట్‌లో అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో కూలర్ల ధరలు ఉన్నాయి. బ్రాండ్ కంపెనీలకు చెందిన కూలర్లు మార్కెట్‌లో రూ.10వేల నుంచి రూ.25వేల వరకు లభ్యం అవుతున్నాయి. ఫైబర్ కూలర్లతో పోలిస్తే అసెంబుల్డ్ కూలర్లు (ఇనుప రేకులతో తయారీ చేసినవి) ఎక్కువ చల్లదనం ఇవ్వడంతో వీటికి డిమాండ్ ఏర్పడింది. అసెంబుల్డ్ కూలర్లు రూ.1800 నుంచి రూ.ఆరు వేల వరకు మాత్రమే ఖరీదు చేస్తున్నాయి. బ్రాండ్ కంపెనీ కూలర్ల కన్నా ఎక్కువ చల్లదనం ఇస్తుండటంతోపాటు ఇవి హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి.

ఇతర ప్రాంతాల నుంచి ముడిసరుకు..

కూలర్ల తయారీలో ఉపయోగించే ముడి సరుకు(రామెటీరియల్)ను హైదరాబాద్, మహారాష్ట్రలోని నాగపూర్, నాందేడ్, పుణె తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. రెడిమేడ్ కూలర్ల కన్నా.. నాణ్యత కల్గిన ఐరన్‌స్టాండ్, ఐరన్ ఫీల్స్, పంపులు, మోటార్, గడ్డి, కలర్‌స్విచ్‌లు, వాటర్ సప్లై పైపులను వినియోగిస్తూ ఇనుప కూలర్లను తయారు చేస్తున్నట్లు వివరిస్తున్నారు. వీటి ధర రూ.3 వేల నుంచి రూ.8 వేల వరకు ఉన్నట్లు పేర్కొన్నారు.



భైంసాలో కూలర్‌కు గడ్డి మారుస్తున్న మెకానిక్

యువతకు ఉపాధి..

జిల్లాలోనే కూలర్లను తయారు చేస్తుండటంతో స్థానిక యువతకు ఉపాధి దొరుకుతోంది. దుకాణాలతోపాటు రిపేరింగ్ షాపులు నిర్వహించుకుంటూ స్వయంఉపాధి పొందుతున్నారు. ఒక్కో దుకాణంలో 200 కు పైనే కూలర్లు అమ్ముతారని వ్యాపారులు పేర్కొంటున్నారు.

చల్లదనం కోసం కొన్నా..



వేసవిలో చల్లదనం కోసం కూలర్‌ను కొనుగోలు చేశా. ఎండల తీవ్రత కారణంగా ఇబ్బంది పడుతున్నాం. వేసవి ప్రారంభంలోనే కొనడంతో మాకు తక్కువకు వచ్చింది. ఇప్పుడు ధరలు పెరిగాయని అంటున్నారు.
– రాంపటేల్, హిప్నెల్లి, మం.తానూరు

గిరాకీ పెరిగింది



ఎండల కారణంగా మాకు గిరాకీ పెరిగింది. పాతకూలర్లకు జాలిలు ఏర్పాటు చేయడం, ఇతర మరమ్మతులు చేస్తూ ఉపాధి పొందుతున్నాం. వేసవిలో హోటళ్లు, పెళ్లి సమయంలో కూలర్ తప్పనిసరి. ఇప్పుడు చేతినిండా పని దొరుకుతోంది.
– నరేశ్, కూలర్ మెకానిక్, తానూరు

270 కూలర్లు విక్రయించా..



ఐటీఐ పూర్తి చేసి కొన్నేళ్లుగా కూలర్లను తయారు చేస్తున్నా. ఫైబర్ కూలర్లతో పోలిస్తే ఎంతో నాణ్యంగా అసెంబుల్డ్ కూలర్లను తయారు చేసి విక్రయిస్తున్నాం. ఈసీజన్‌లో ఇప్పటివరకు 270కి పైగా కూలర్లను విక్రయించాం. ఎండాకాలం రావడంతో కూలర్లకు మరింత డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం రోజు కూలర్ల అమ్మకాలు బాగానే జరుగుతున్నాయి.
– సాయికిరణ్, వ్యాపారి, ముధోల్

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి



ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

లోకేశ్వరం: ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి రాజేశ్వర్‌గౌడ్‌కు ఆ పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. బీజేపీ మండల కన్వీనర్ బొడికె సాయన్న మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుమన్‌కుమార్, చిన్నారావు, శ్రీధర్, జయసాగర్‌రావు, విలాస్, రాజశేఖర్, శ్రీధర్‌రెడ్డి, భూమేశ్, నల్ల రమేశ్, రాజు ఉన్నారు.

కూలీలు ఉపాధి పనులకు వచ్చేలా చూడాలి

లోకేశ్వరం: ఎండల తీవ్రత కారణంగా కూలీలు ఉదయమే ఉపాధి పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగంగా.. నాణ్యతతో చేపట్టాలని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం చేసుకున్న 626 మంది దరఖాస్తులను, రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను పరిశీలించారు. పని ప్రదేశంలో కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. తహసీల్దార్ మోతీరాం, ఎంపీడీవో వెంకటరమేశ్, ఈవోపీఆర్డీ సోలమాన్‌రాజ్, ఆర్‌డబ్ల్యూ ఏఈ సాయిప్రసాద్, ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్ ఉన్నారు.

వాహనదారులకు అన్నిపత్రాలు ఉండాలి



ఖానాపూర్: వాహనదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ రాజేశ్‌మీనా



నిర్మల్‌లో వాహనదారుడిని ధ్రువపత్రాలు అడుగుతున్న పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్



భైంసాలో తనిఖీ చేస్తున్న పోలీసులు



లక్ష్మణచాంద: కనకాపూర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి ఎస్సై సుప్రియ



సారంగాపూర్: స్వర్ణ గ్రామంలో..

ఖానాపూర్: వాహనదారులు విధిగా వాహన బీమా, డ్రైవింగ్ లైసెన్సు, ఆర్‌సీ తదితర పత్రాలను కలిగి ఉండాలని నిర్మల్ ఏఎస్పీ రాజేశ్‌మీనా అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో శనివారం నిర్వహించిన నాకాబందీలో ప్రజలకు అవగాహన కల్పించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్, సీటు బెల్టు లేకుండా వాహనాలు నడపడం నేరమన్నారు. జిల్లా ఎస్పీ జానకీషర్మిల ఆదేశాల మేరకు శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా నాకాబందీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ అజయ్, పోలీసులు పాల్గొన్నారు. ఖానాపూర్ ఎన్టీఆర్ చౌరస్తాలో నాకాబందీ తనిఖీలు నిర్వహించారు. ప్రధాన రహదారులపై సీఐ సీహెచ్.అజయ్ ఆధ్వర్యంలో సిబ్బంది వాహనదారుల ధ్రువపత్రాలను పరిశీలించారు. మద్యం తాగి నడిపినా.. లైసెన్స్ లేకుండా నడిపినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భైంసాటౌన్: పట్టణంలో శనివారం సాయంత్రం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. సీఐ జి.గోపినాథ్ ఆధ్వర్యంలో ప్రధాన రోడ్ల వెంట తనిఖీ చేసి ధ్రువపత్రాలు, నంబర్ ప్లేట్ లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తనిఖీలు చేపట్టిన ట్లు పేర్కొన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు వాహనాలకు ఇన్సూరెన్స్ లేక పరిహారం అందడం లేదన్నారు. ఈ విషయమై వాహనదారులకు అవగాహన కలిగేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఆయన వెంట ఎస్సై గణేశ్, ఎండీ గౌసుద్దీన్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

నిర్మల్‌టౌన్: ఎస్పీ ఆదేశాల మేరకు ఏఎస్పీలు అవినాష్‌కుమార్, రాజేష్ మీనా పర్యవేక్షణలో జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో శనివారం సాయంత్రం ఏకకాలంలో నాకాబందీ నిర్వహించారు. సరైన వాహనాల ధ్రువపత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని వాహనాలను పట్టుకున్నారు. నంబర్ ప్లేట్ లేకున్నా.. విరగొట్టిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్‌స్టేషన్ల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సారంగపూర్: మండలంలోని స్వర్ణ గ్రామంలో శనివారం ఎస్సై శ్రీకాంత్ నాకాబందీ కార్యక్రమం నిర్వహించారు. వాహనాల తనిఖీ నిర్వహించి.. సరైన ధ్రువపత్రాలను లేని వాహనాలపై కేసులు నమోదు చేశారు. వాహనదారులు అన్ని ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని ఎస్సై పేర్కొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ వద్ద ఇన్‌చార్జి ఎస్సై సుప్రియ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్సై వెంట సిబ్బంది ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



మేడిపల్లిలో ప్రారంభిస్తున్న చైర్మన్ భీమ్‌రెడ్డి

నిర్మల్‌రూరల్: మండలంలోని మేడిపల్లి, చిట్యాల, ముజ్గి, తాంశ, కొట్ల (కె) గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్మల్ ఏఎంసీ చైర్మన్ భీమ్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, ధర్మాజీ రాజేందర్, పద్మాకర్, ఏపీఎం బోసు, సీసీ నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముధోల్: మండలంలోని చింతకుంటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీఈవో సాయారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో రైతులు ఉన్నారు.

కాంగ్రెస్ పోరాటంతోనే కులగణన



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సారంగపూర్: కాంగ్రెస్ నాయకుల పోరాటంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ మాదిరి దేశ వ్యాప్తంగా కులగణన చేయాలని నిర్ణయించిందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సారంగపూర్‌లో రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నర్సయ్య, ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ మాట్లాడారు. కులగణన సర్వే పూర్తి చేసి కులాల ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. కార్యక్రమంలో అడెల్లి ఆలయ కమిటీ చైర్మన్ భోజాగౌడ్, అడెల్లి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్వర్, నాయకులు కోర్వ నవీన్‌రెడ్డి, మధు, భూమారెడ్డి, ముత్యంరెడ్డి, సత్యం, జగదీశ్వర్, బట్టు భోజన్న, సుభాష్, మైలి రాజేశ్వర్, మేదరి లస్మన్న తదితరులు ఉన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

లక్ష్మణచాంద: మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో ఈనెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలని శుక్రవారం ప్రిన్సిపాల్ రాజు ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు ఇంగ్లీష్ మీడియంలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ mjptbcwreis. telangana. gov. in సందర్శించాలన్నారు. సందేహాలుంటే 79934 56616, 97041 19790 నంబర్లకు కాల్ చేసి నివృత్తి చేసుకోవాలని.. లేకుంటే కళాశాలకు వచ్చి సంప్రదించాలని కోరారు .

కరాటేతో ఆత్మవిశ్వాసం



కరాటే శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘ్‌చాలక్ విజయ్‌కుమార్

నిర్మల్‌టౌన్: కరాటేతో బాలికల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘ్‌చాలక్ నూకల విజయ్‌కుమార్ అన్నారు. కరాటే శిక్షకురాలు కిన్నెర్ల మృణాళిని ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని నగర్‌లో ఝాన్సీ లక్ష్మీబాయి ఉచిత కరాటే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ తరగతులను శనివారం ప్రారంభించారు. 12 ఏళ్ల నుంచి 25 ఏళ్లలోపు మహిళలకు ఇందులో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈనెల 3 నుంచి జూన్ 1 వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఉదయం 6 నుంచి 8 గంటల శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. వివరాల కోసం 63040 44255, 99513 04468 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జపాన్ కరాటే అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తేజేందర్‌సింగ్ భాటియా, వివేక్ హైస్కూల్ కరస్పాండెంట్ గంద్రత్ రమేశ్, మంచిరాల నాగభూషణం, ఆడెపు సుధాకర్, సోలాపూర్ రాజేశ్వర్, మధుకర్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

5వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు

లోకేశ్వరం(కుంటాల): కుంటాల మండలంలోని గ్రామపంచాయతీల్లో ఈనెల 5 నుంచి 12 వరకు భూభారతిపై రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కమల్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. 5న మొదల్‌పూర్, రైపాడ్, ఓలా, 6న సూర్యపూర్, అంబకంటి, లింబాబి, 7న రాజాపూర్, కుంటాల, వెంకూర్, 8న లింబా(కె), కల్లూర్, విఠాపూర్, 9న దౌనెల్లి, అందకూర్, పెంచికల్‌పాడ్, 12న అంబుగాం గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేశామని.. రైతులు హాజరు కావాలని కోరారు.

క్యాంప్‌లు సద్వినియోగం చేసుకోవాలి

లోకేశ్వరం(కుంటాల): విద్యార్థులు సమ్మర్‌క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో ముత్యం అన్నారు. కుంటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు యోగా సాధన చేశారు. ఉపాధ్యాయులు ఉన్నారు.